# ప్రజలే నా కుటుంబం



జగిత్యాల పట్టణంలో వృద్ధురాలితో మాట్లాడు కారు గుర్తుకు ఓటెయాలని అభ్యర్థిస్తున్న జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

- అండగా ఉంటా.. ఏ కష్టమొచ్చినా ఆదుకుంటా
- సమైక్య పాలనలో సీఎంఆర్ఎఫ్ సాయం అంటే తెలియకుండా చేశారు..
- స్వపరిపాలనలో బాధితులందరికీ సాయం చేస్తున్నాం
- జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 29: 'జగిత్యాల నియోజకవర్గంలోని 3లక్షల మంది ప్రజలే నా కుటుంబ సభ్యులు వారికి ఆపదొస్తే అండగా ఉంటా. కష్టమొస్తే ఆదుకుంటానని' జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 22, 37వ వార్డుల్లో తన సతీమణి రాధికతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో కొత్త ఇండ్లు కట్టకుండా, ఎప్పుడో తాతల కాలం నాటి ఇండ్లను చూపెడుతూ మేమే ఇండ్లను నిర్మించి ఇచ్చామని ఆ పార్టీ నేతలు గొప్పలకు పోతున్నారని ఎద్దేవా చేశారు. కానీ ఇచ్చిన హామీ ప్రకారం జగిత్యాల పట్టణంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 4520 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్లను అందజేశామన్నారు. 22,37 వార్డుల్లోని ఎంతో మందికి డబుల్ బెడ్రూం ఇండ్లను సైతం ఇప్పించామని తెలిపారు. అర్హులందరికీ త్వరలోనే డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సమైక్య పాలనలో ముఖ్యమంత్రి సహాయనిధి అంటే తెలువని పరిస్థితి ఉండేదని, కానీ ఈ రెండు వార్డుల్లో ఎంతో మంది బాధితులకు వైద్యఖర్చులకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించామని చెప్పారు. అధ్వానంగా మారిన జగిత్యాల బైపాస్ రోడ్డును అభివృద్ధి చేశామని, కృష్ణానగర్, అరంద్‌నగర్‌లో కొత్త పైపులైన్ వేసి నీటి ఎద్దడిని నివారించామని గుర్తు చేశారు. వార్డుల్లోని ప్రజలకు, యువతకు సేవాగుణం, ఆధ్యాత్మిక భావన ఎక్కువ అని, దీనిని గుర్తించే వార్డుల పరిధిలోని ఆలయాలకు ఇప్పటివరకు రూ.1.20 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. రైతులకు రైతుబీమా వర్తింపజేస్తున్నట్లే, మళ్లీ అధికారంలోకి రాగానే ప్రతి పేద వారికి కేసీఆర్ బీమా పేరుతో రూ.5లక్షల బీమా చేస్తామని, పింఛన్లను పెంచుతామని హామీ ఇచ్చారు. మోతె చెరువు కట్ట వద్ద పెద్ద మురుగు కాలవను నిర్మించామని, బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వీలుగా మెట్లను సైతం కట్టించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు.

**బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు**

22,37 వార్డుల్లో ఇంటింటా ప్రచారం సందర్భంగా 22వ వార్డుకు చెందిన వీరబత్తిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు చెందిన వంద మంది నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పార్టీ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, నాయకులు వీరబత్తిని శ్రీనివాస్, జితేందర్, మహేందర్, ఆడెపు సత్యం, అజీజ్, సుభాష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# కోరుట్లలో కారు హవా



కోరుట్లలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

- స్పీడందుకున్న ప్రచారం
- జోరుగా చేరికలు.. పెరుగుతున్న ప్రజా మద్దతు
- జనంలోనే సంజయ్ కల్వకుంట్ల
- కోరుట్లలో పార్టీలోకి 50 మంది యువకులకు ఆహ్వానం

కోరుట్ల, అక్టోబర్ 29: కోరుట్లలో బీఆర్ఎస్ జోరు పెరిగింది. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నది. ఊరా వాడా గులాబీ శ్రేణుల హోరు కనిపిస్తుండగా, నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల జనంలోనే కలియదిరుగుతున్నారు. యువతతో మమేకమై ముందుకుసాగుతుండగా, మరోవైపు బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనకు మెచ్చి వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరిపోతున్నారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని 7వ వార్డు అర్బన్ కాలనీకి చెందిన 50 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి సంజయ్ కల్వకుంట్ల గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులతో సంజయ్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తేనే అనుకున్న పనులు జరుగుతాయని చెప్పారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలని, కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతున్నదని చెప్పారు. ఇక్కడ మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, పీఏసీఎస్ చైర్మన్ ఎలిశెట్టి భూంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పుప్పాల ప్రభాకర్, అతిక్, అర్బాజ్, చిత్తరి ఆనంద్ ఉన్నారు.

## 3 గంటల కరెంటిచ్చే కాంగ్రెస్సా..?

# 24 గంటలిచ్చే బీఆర్ఎస్సా



మల్యాల : రాజారాంలో మాట్లాడుతున్న చొప్పదండి బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి సుంకె రవిశంకర్

- ఎవరు కావాలో మీరే నిర్ణయం తీసుకోండి
- మరొకసారి ఆశీర్వదించండి మరింత అభివృద్ధి చేస్తా
- చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్
- మల్యాల మండలంలోని విస్తృత ప్రచారం

మల్యాల, అక్టోబర్ 29: 'ఎన్నికలు వచ్చాయి. ఎలాగైనా అధికారంలోకి రావాలని ప్రతిపక్షాలు కల్లబొల్లి మాటలతో గ్రామాల మీద పడ్డయి. కాంగ్రెస్ అన్నీ ఫేక్ హామీలు ఇస్తున్నది. కర్ణాటకలో వ్యవసాయానికి పుష్కలంగా కరెంట్ ఇస్తామని నమ్మించి మోసం చేసింది. అక్కడ మూడు గంటల కంటే ఎక్కువ ఇస్తలేరు. రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తుంటే ఏం చేయలేక చేతులెత్తేసింది. ఇక్కడ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా సాగుకు మూడు గంటలే చాలు అంటున్నడు. నేనొక్కటే అడుగుతున్నా.. 3 గంటల కరెంటిచ్చే కాంగ్రెస్ కావాలా..? 24 గంటల నిరంతర విద్యుత్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలా..? మీరే ఆలోచించుకోండి' అంటూ చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మల్యాల మండలంలోని రాజారాం, పోతారం, ఓగులాపూర్, రాంపూర్‌లో సుంకె రవిశంకర్ స్థానిక నాయకులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. కాగా గ్రామాల్లో సుంకె రవిశంకర్‌కు అడుగడుగునా మహిళలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ మాట్లాడారు. తెలంగాణలో పదేండ్ల క్రితం ఉన్న పరిస్థితులకు, ప్రస్తుత పరిస్థితులకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలని సూచించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఘననీయమైన అభివృద్ధి జరిగిందని వివరించారు. ప్రత్యేకంగా సాగునీటి ప్రాజెక్టుల వల్ల నియోజకవర్గం సస్యశ్యామలం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. సమైక్య పాలనలో మల్యాల, కొడిమ్యాల, గంగధర మండలాలు కరువుతో అల్లాడేవని వాపోయారు. కానీ స్వపరిపాలనలో నియోజకవర్గంలో నిర్మించిన ఎల్లంపల్లి నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటి పంపింగ్, ఎస్సారెస్పీ పునర్జీవ పంప్‌హౌజ్ నిర్మాణం, వరదకాలువకు తూములు నిర్మించి గొలుసుకట్టు చెరువులను నింపడం వల్ల కోనసీమలా మారిందన్నారు. పథకాలకు అడ్డుపడుతున్నరని, ఢిల్లీ గులాంలైన కాంగ్రెస్, బీజేపీ మనకు వద్దే వద్దని, వచ్చే ఎన్నికల్లో వారికి గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ పెట్టుబడి సాయం అందజేస్తుంటే రైతుబంధు ఉత్తదే అన్న ఉత్తమ్ కావాలో? రైతును రాజు చేసిన కేసీఆర్ కావాలో ప్రజలే ఓ సారి ఆలోచించాలన్నా రు. ఎన్నికలు ఉండడంతో అన్ని పార్టీల నాయకుల కల్లబొల్లి మాటలు చెబు తూ పల్లెల్లోకి వస్తున్నారని, వారు ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఏం చేశారో నిలదీయాలని ప్రజలకు సూచించారు. మరోసారి సీఎంగా కేసీఆర్ కావాలంటే ప్రజలు తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో మలిచి స్థానికంగా తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. 'ఏ కష్టం వచ్చిన అందరికీ అందుబాటులో ఉంటూ సేవ చేసేవాడిని.. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే... మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని' స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, జడ్పీటీసీ కొండపలుకుల రాంమోహన్‌రావు, జడ్పీ కో–ఆప్షన్ సుభాన్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, సహకార సంఘాల అధ్యక్షులు ముత్యాల రాంలింగారెడ్డి, అయిల్నేని సాగర్‌రావు, బోయినిపల్లి మధుసూదన్‌రావు, వైస్ ఎంపీపీ పోతాని రవి, సర్పంచులు బద్దం తిరుపతిరెడ్డి, ఎడిపల్లి సుగుణాఅశోక్, పొన్నం సరోజనామల్లేశం, గొడుగు కుమారస్వామి, సుంకె లచ్చయ్య, బద్దం తిరుపతి, నాయకులు తైదల శ్రీలత, కాకెర సుదర్శన్‌రెడ్డి, పిట్టల శ్రీను, ముద్దం చందు, కోటేశ్వర్‌రావు, కట్కూరి నాగార్జున, బోయినిపల్లి మనోజ్, బట్టు విజయ్, తైదల గణేశ్, తెడ్డు సురేశ్, గుడిసె అలంకార్, అల్లూరి అనిల్‌రెడ్డి, బొంకూరి వేణురావు, కమఠం గంగారాజం, పందిరి శేఖర్, బండి సత్తయ్య, నక్క శేఖర్, మీనుగు నరేశ్, కార్యకర్తలు, కళాకారుల బృంద సభ్యులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌దే మళ్లీ అధికారం



పార్టీలో చేరిన కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

- ఎవరేం చేసినా గెలుపు మాదే
- ప్రతిపక్షాలతో అయ్యేది లేదు పోయేది లేదు
- సంజయ్‌కు భారీ మెజార్టీ అందించాలి
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు
- సాతారంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

మల్లాపూర్, అక్టోబర్ 29: 'రాష్ట్రంలో ప్రజలందరూ సీఎం కేసీఆర్ వెంటే ఉన్నరు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే మళ్లీ అధికారం. ఎవరేం చేసినా అది ఆగేది కాదు. వంద సీట్లకు పైగా విజయం సాధించడం ఖాయమని' బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దీమా వ్యక్తం చేశారు. ఆదివారం మల్లాపూర్ మండలం సాతారంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో గ్రామాల్లోని బీఆర్ఎస్ శ్రేణులు పకడ్బందీగా పనిచేయాలని కోరారు. పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బొడ్డు రాజేశ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు అచ్చ చిన్నరాజం, నాయకులు రాజరెడ్డి, బాలు, రాజం, లక్ష్మీరాజం, తుక్కయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.